అటవీ భూముల ఆక్రమణ దారులపై కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జిల్లాలో అటవీ భూముల ఆక్రమణ దారులపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేటు లోని తన ఛాంబర్ లో జిల్లా స్థాయి ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. అటవీ భూముల రక్షణ , సర్వే , జిల్లాలో హరిత వనాల పెంపకం , సముద్ర తీర ప్రాంత సంరక్షణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ రక్షణలో భాగంగా అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా, అక్రమ రవాణాలను అరికట్టేందుకు జిల్లాలో నిఘా చేపట్టాలని తెలిపారు. హరిత వనాల పెంపకంలో భాగంగా జూలై నెలలో 15000 మొక్కలు జియో టాగింగ్ చేసి, పూర్తి సంరక్షణ చర్యలతో నాటుటకు సిద్ధంగా ఉంచాలని ఫారెస్ట్ , జివిఎంసి అధికారులను ఆదేశించారు. పరవాడ మండలం, ఇస్లాంపేట గ్రామంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సర్వే చేయాలని విఎమ్ఆర్డిఏ అధికారులను ఆదేశించారు. విశాఖ ఆర్కే బీచ్ లో గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు చేయడం ద్వారా బీచ్ ప్రాంతం మొత్తం అదనపు లైట్లు, ఆర్టిఫిషియల్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. దీని వలన సముద్ర తాబేళ్లు గుడ్ల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ టర్టిల్ ఫ్రెండ్లీ బీచ్ ఏర్పాటుకు నో లైట్ జోన్లు ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 181 కేసులు బుక్ చేయడం జరిగిందని దీని ద్వారా 14.26 లక్షలు వసూలు చేయడం జరిగిందని డిఎఫ్ఓ అన్నారు. నాలుగు వన్యమృగాల కేసులు వివిధ దశలలో కోర్టులలో పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గంజా పెంపకం , అక్రమ రవాణా లేకుండా చూడాలని , అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతుందని, అరికట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ అధికారులు రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో జాయింట్ సర్వే చేసి అటవీ భూముల సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్, జిల్లా ఫారెస్ట్ అధికారి అనంత్ శంకర్, జూ క్యురేటర్ నందిని సలారియా, జివిఎంసి జోనల్ కమీషనర్ శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పలువురు బదిలీ

విశాలాంధ్ర - కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయము నందు పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇక్కడ సూపరెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న మంజుల రాణి విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు బదిలీపై వెళ్ల గా ఇక్కడకు జి.మాడుగుల ఎంపీడీవో కార్యాలయము నందు పనిచేస్తున్న అప్పలరాజు రానున్నారు. అలాగే ఇదే కార్యాలయం నందు పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ డి.గౌరవపతిరావు చోడవరం పిఆర్ సబ్ డివిజన్‌కు బదిలీపై వెళుచున్నారు.

కమనీయం..నిత్య కళ్యాణం

విశాలాంధ్ర - సింహాచలం : దేశ, విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆర్జిత సేవ కమనీయంగా జరిగింది. అర్చకులు, వేద పండితులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పిదప పెరుమాళ్ ను గోవింద రాజు స్వామిగా సర్వాంగ సుందరంగా అలం కరించి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ గురుడ సేవ, నిత్య కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తేనే భావితరాలకు భవిష్యత్

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ ఎన్.ఎస్. టి.ఎల్ లో ప్రపంచ పర్యారణ దినోత్సవం పురస్కరించుకుని పలువురు వక్తలు ప్రసంగించారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ హెచ్‌ఓడి (పర్యావరణ శాస్త్రాలు) ప్రొఫెసర్ ఇ ఉదయ్ భాస్కర్ రెడ్డి 'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తేనే భావితరాలకు భవిష్యత్ అన్నారు. ఎన్ఎస్‌టిఎల్, ఎన్ఎస్‌టిఎల్, ఐఇఇ ఛైర్మన్, విశాఖపట్నం సెంటర్ ఛైర్మన్ శ్రీ పివిఎస్ గణేష్ కుమార్ అధ్యక్షత వహిస్తూ, పర్యావరణ సవాళ్లు, ప్రపంచాన్ని మరింత సుస్థిరంగా మార్చేందుకు అవసరమైన చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ ఏడాది ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో ఆయన 'ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రమాణం' చేయించారు.

ఏఐవైఎఫ్ 11వ విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - విశాఖ : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా మహాసభల పోస్టర్‌ని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళ వారం ఎఐవైఎఫ్ మాజీ నాయకులు డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లడుతూ నేటి పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా యువతను మోసగిస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. దేశంలో యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని నిలదీశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిందని, నోటిఫికేషన్ ఎక్కడ అని ప్రశ్నించారు. ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. దీనిపై విశాఖ కేంద్రంగా ఎ ఐ వై ఎఫ్ ను విస్తృతంగా బలోపేతం చేసి మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ యు. నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణ అలసత్వంపై ఐటీడీఏ పీఓ అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : అంగన్వాడీ భవన నిర్మాణాలలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ హెచ్చరించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలో అంగన్వాడీ భవన నిర్మాణాలు నాడు నేడు పనుల పురోగతిపై సిడిపిఓలు, సూపర్ వైజర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 128 కొత్త అంగన్వాడీ భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ విడుదల చేసిందన్నారు. రెండవ విడత రివాల్వింగ్ ఫండ్ జమ చేయడం జరిగిందని నేటికి గోతులు, స్థాయిలోనే నిర్మాణపు పనులు ఉన్నాయని అన్నారు. 20 భవనాలు మాత్రమే రూఫ్ స్థాయి పనులు పూర్తి చేసారని అసంతృప్తి వ్యక్తం చేసారు. పాడేరు నియోజక వర్గంలో 15 అంగ్వాడీ కేంద్రాలు, అరకువ్యాలీ నియోజక వర్గంలో 30 అంగన్వాడీ కేంద్రాలు పునాదుల స్థాయిలో ఉన్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలకు సిడిపిఓలు, సూపర్ వైజర్లు బాధ్యత వహించ వలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఐసిడి ఏస్‌పిడిఎస్. సూర్య లక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ఇఇడి.వి.ఆర్. ఎం.రాజు, 11 మండలాల సిడిపిఓలు, సూపరిండెంట్ జి.ఆర్. సి.హెచ్. మూర్తి, సూపర్ వైజర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏయూ సదస్సుకు కేంద్రమంత్రి నారాయణస్వామికి ఆహ్వానం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం, అంబేద్కర్ చైర్ సంయుక్తంగా జూలై 1,2వ తేదీలలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు 'డిజైన్ థింకింగ్'కు ముఖ్య అతిథిగా రావాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నారాయణ స్వామిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ ఆహ్వానించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సూచనలతో మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రిని కలసి ఏయూలో సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, సదస్సును ప్రారంభించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంగా అంబేద్కర్ చైర్ నుంచి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. జేమ్స్ స్టీఫెన్ కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతూ సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు తమకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఏయూ రిజిస్ట్రార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ సులేమాన్ తదిరతులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో వైజాగ్లోని రుషికొండ బీచ్లో క్లీన్-ఏ-థాన్ అనే పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 ఫ్లస్ బీచ్ లు నీటి వనరులను శుభ్రం చేయదానికి బ్యాంక్ యొక్క దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా ఈ చొరవ ఉంది. ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం మరియు బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడం యొక్క ఆవశ్యకతను నొక్కిచెప్పడానికి సుమారు 120 ఫ్లస్ వాలంటీర్లు ప్రచారంలో చేరారు. ముఖ్య అతిథి గా జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, స్వచ్ఛంద సంస్థ భాగస్వామి మనం వనం పాల్గొన్నారు. ఈ పరిశుభ్రత కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచ్ ఉద్యోగులు, స్థానిక కమ్యూనిటీలు, పర్యావరణ కార్యకర్తలు / ప్రభావశీలురు, స్థానిక అధికారులు వాలంటీర్లు పాల్గొన్నారు, వారు నీటి వనరుల నుండి సుమారు 450 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి పండగ

విశాలాంధ్ర - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచా యతీలో కొలువెన శ్రీ ముత్యాలమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ధర్శనానికి బారులు తీరారు. పసుపు కుంకుమ, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్య నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు అమ్మవారిని ధర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అంతకు ముందు ఆదిదేవతల ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ చింతకాయల సుజాత ముత్యాలు అమ్మవారికి పసుపు కుంకమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. ఈ సంధర్భంగా అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నాయకులు కూండ్రపు శ్రీరామమూర్తి సురాడ బంగార్రాజు, జాజుల చిన్నారావు చింతకాయల అమర్, చింతకాయల ముత్యాలరావు, సురాడ ఎల్లాజీ, చిన్నారావు, చింతకాయల సతీష్, సురాడ కృష్ణ, తిత్తి మహేశ్, అర్జిల్లి నూకరాజు, కొరివి చినముత్యాలు, కణితి చినసోమేశ్వరరావు, అప్పలరాజు పూజల్లో పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు త్వరగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి : నాడు నేడు పనులను త్వరగతిన పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు చర్యలు చెప్పట్టలని ఎంపీడీఓ కుమార్ అన్నారు. మండలంలో గల కొత్తూరు కస్తూరిబా గాంధీ, మండల పరిషత్ పాఠశాలను మంగలవారం తనిఖీ చేసి నాడు నేడు పనులను పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేటప్పట్టికి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అవసరం అయిన పనులు చేయాలని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులతో సమన్వాయం చేసుకుంటూ పనులు ముందుకు సాగించాలని చెప్పారు.

ఇంట్లో చొరబడి కెమెరాలు, సెల్ ఫోన్‌లు చోరీ చేసిన దొంగలు

విశాలాంధ్ర - యలమంచిలి : పట్టణంలో కొత్తపేట వీధిలో దొంగతనం జరిగినట్లు స్థానిక పట్టణ ఎస్సై కె.పాపినాయుడు తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం యలమంచిలి మున్సిపాలిటీ కొత్తపేట వీధిలో దొడ్డి సాయికుమార్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చొరబడి 2 కెమెరాలు, 2 సెల్ ఫోనలు అప హరించారన్నారు. ఉదయం చోరీ జరిగిందన్న సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు దారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాపినాయుడు మీడియాకు తెలియజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - కూనవరం : కూనవరం గ్రామానికి చెందిన కొండారు వెంకట నరసమ్మ అనే మహిళకు ఇటీవల హార్ట్ ఆపరేషన్ జరగడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 80 వేల రూపాయల చెక్కును దూగుట్ట గ్రామానికి చెందిన పాపారావు అనే వ్యక్తికి 35 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్సీ అనంతబాబు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా ఎల్లవరం గ్రామంలో అందజేయడం జరిగింది ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్ ఆవుల మర్యాదాను మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన ఇబ్బందులు వచ్చిన వెన్ను తట్టి నేనున్నానంటూ సహాయం అందించడంలో అనంత బాబు ముందుంటారని కొనియాడారు ఆర్థిక సహాయం అందడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వైసిపి ప్రెసిడెంట్ ఆలూరి కోటయ్య బుజ్జ బాబు నోముల కొండలరావు ఇంటి పూర్ణయ్య దీకొండ లక్ష్మి ప్రసాద్ గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కళాజాత ప్రదర్శన

విశాలాంధ్ర - యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం యలమంచిలి పట్టణ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వివిధ కళాకారుల బృందంచే ప్రజలకు నాటికలు, హాస్య సన్నివేశాలతో కాలుష్య నివారణకు సంబంధించి ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పాట రూపంలో పాడుతూ ప్లాస్టిక్ నియంత్రించాలన్నారు. అలాగే ప్రతీ ఒక్కరూ ఒక్కో మొక్కను నాటితే ఒక మనిషికి 65 సంవత్సరాలకు రూ.5 కోట్లు విలువ చేసే ఆక్సిజన్ ను అందిస్తాయి కాబట్టి ప్రతీ ఒక్కరూ చెట్టు నాటడం ద్వారా కాలిష్యాన్ని ఆరికట్టడం కూడా మన చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ఆశక్తిగా తిలకించారు.

అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఎంపీ

విశాలాంధ్ర - దేవీపట్నం : అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో పవిత్ర గోదావరి నది ఒడ్డున వేంచేసి యున్న మాతృశ్రీ గండి పోఅమ్మశమ్మ అమ్మవారిని రంపచోడవరం ఎమ్మెల్యే నాగూలాపల్లి ధనలక్ష్మి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ పోలవరం ప్రాజెక్టు సందర్శనలో పాల్గొన్న ఇరువురు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట దేవీపట్నం జెడ్పిటిసి శీరసం పెద్దబ్బులు ఎంపీపీ మురళి మార్కెటింగ్ యాడ్ చైర్మన్ కందుల బాబ్జి పోలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25 బస్తాల తునికాకు దగ్ధం

విశాలాంధ్ర - చింతూరు : చింతూరు మండలంలోని పావుర్లంక గ్రామంలోని తునికాకు కళ్ళంల్లో రవాణాకి సిద్ధంగా ఉన్న 25 తుని కాకు బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దగ్ధం చేశారు. ఈ సంఘటనపై చింతూరు ఎస్సై శ్రీనివాస్ ను వివరణ కోరగా ఇది మావోయిస్టుల పనా, లేదా ఆకతాయిల పనా అనేది తెలియ రాలేదని తెలిపారు.

కడుమూరులో రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర/ మారేడుమిల్లి : మండలంలోని కుండాడ పంచాయతీ కడుమూరు గ్రామంలో రీ సర్వే సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తప్పనిసరిగా ప్రతి రైతు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి వీఆర్వో మురళి కృష్ణ, సర్వేయర్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లి తహశీల్దార్‌గా అంబేద్కర్

విశాలాంధ్ర - నక్కపల్లి : నక్కపల్లి మండల తహశీల్దార్‌గా ఎస్.వి.అంబేద్కర్ బదిలీపై వచ్చారు. గతంలో బుచ్చియ్యపేట మండల తహశీల్దార్ పనిచేసారు. ఇప్పటి వరకు ఎఫ్.ఎ.సి.గా విధులు నిర్వహిస్తున్న నీరజ నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కారిచడం జరుగుతుందన్నారు.

మెయిన్‌రోడ్డును పరిశీలించిన వీఎంఆర్డీఏ అధికారులు

విశాలాంధ్ర - పాయకరావుపేట : పాయకరావుపేట మెయిన్‌రోడ్డును విఎంఆర్డిఏ ఈఈ పి.తాతాజీ, డిఈ జేసిపి సింగ్, ఏఈ రవిశంకర్ మంగళవారం పరిశీలించారు. పాయకరావుపేట విస్తరణ కోసం విడుదలైన రూ.5.60కోట్లు నిధులు రోడ్డు విస్తరణ చేయకపోవడం వలన నిధులు వెనక్కు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే మెయిన్‌రోడ్డు పరిస్థితి, ప్రజలు పడుతున్న ఇబ్బందులు స్థానిక నాయకులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దృష్టికి తీసుకు వచ్చారు. ఏవిధంగానైనా మెయిన్‌రోడ్డు విస్తరణ లేదా ఉన్న రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే కోరినట్లు సమాచారం. ఈమేరకు మెయిన్‌రోడ్డు పరిస్థితి, ఆక్రమణలు పరిశీలించాలని, రోడ్డుకు మరమ్మత్తులు చేస్తే అయ్యే ఖర్చు ఎస్టిమేట్లు వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విఎంఆర్డిఏ అధికారులు పర్యటించారు. ఉన్న రోడ్డుకు సుమారు రూ.కోటి లోపు నిధులతో మరమ్మత్తులు చేసేందుకు అధికారులు సిద్ధ పడుతున్నారని సమాచారం. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జైప్రకాష్, నాయకులు గారా ప్రసాద్, జగతా శ్రీను, సర్వేయరు సత్తిబాబు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో రెమో యాదవ్ సేవలు అద్వితీయం : గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : కరాటేలో రెమో లయన్స్ (డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో వేసవి శిబిరం ద్వారా పిల్లలకు విశిష్టమైన సేవలు అందించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలిలో ఉన్న సిడర్ స్కూల్ ప్రాంగ ణంలో జీవిఎంసీ మరియు రెమో లయన్స్ సంయుక్తంగా నిర్వహించిన వేసవి కరాటే శిబిరం ముగింపు కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి పరిసర ప్రాంతంలో ఉన్న విద్యార్థులకు రెమో లయన్స్ సంస్థ ద్వారా కరాటే మరియు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇస్తూ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించేటప్పుడే పిల్లలో నైపుణ్యం వృద్ధి చెందుతుందని అన్నారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే ఓపెన్ చాంపి యన్ షిప్ పోటీలో రెమో లయన్స్ టీమ్ కి 20 పథకాలు లభించాయని అన్నారు. అందులో గోల్డ్ 7, సిల్వర్ 6, బ్రాంజ్ 7 పథకాలు వచ్చాయని అన్నారు. ఇంత వరకు మా అసోసియేషన్ కి సహకరించిన పెద్దలందరికి హృదయ పూర్వక ధన్యవాదములు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడర్ స్కూల్ డైరెక్టర్ సుజిత్ సార్, సియారెన మేడమ్, బూర శ్రీను, వరహాలు, సతీష్, రమణ, ఎమ్ టి వి ప్రసాద్ తో పాటు అసోసియేషన్ నుండి రాంబాబు పాల్గొన్నారు.

చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర - అరకులోయ : ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భరత్ కుమార్ నాయక్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై విద్యార్థులకు అవగాహన పరిచారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగము, కళాశాల ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్ల ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ చెట్లను నరకకుండా ప్రతి ఒక్కరూ కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని అన్నారు. జీవకోటి మనుగడ కొనసాగించటానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని తెలియజేశారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.పద్మలత, కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు ఎం అనిత కుమారి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ, వాటికి బదులు రయూజబుల్ వస్తువుల వినియోగాన్ని పెంచాలన్నారు. కార్బన్ ఉద్గారాలను ఎక్కువగా విడుదల చేసే వాహనాల వినియోగాన్ని తగ్గించి సైకిల్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యు ఏసి కోఆర్డినేటర్ పి.కొండబాబు, అధ్యాపకులు జి సుజాత, సుందరి రాణి, ఎన్ నాగేశ్వరరావు, ఎస్.రాజు, ఎన్ఎస్ఎస్ పిఓలు, పి.నాగబాబు, వై విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ పీలా

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయం నందు నిర్వహించబడుచున్న 30వ రోజు వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం 96వ వార్డు కార్పొరేటర్, జి.వి.యం.సి టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సందర్శించారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులచే కథలు చెప్పించారు. విధ్యార్థిని ఎస్.తేజస్విని చెప్పిన తెనాలి రామకృష్ణ కథకు మెచ్చి, రైటింగ్ పాడ్ ని బహుమతిగా అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఉన్నతమైన ఉద్యోగాలు చేయాలని, అందుకు గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు సెక్రటరీ ఆడారి రామకృష్ణ రిసోర్స్ పర్సన్స్ భానుమతి, సత్యనారాయణ ,జబీనా యాస్మిన్ ,మౌనిక పాఠకులు తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయా ధికారిణి బి సూర్యకళ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా పెందుర్తి లో ద్విగ్విజయం గా కొనసాగుతుంది. సమ్మర్ క్యాంప్ నిర్వహణ పట్ల కార్పొరేటర్ పీలా సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం విధ్యార్థులకు చాక్లెట్, బిస్కట్, మజ్జిగ పంపిణి చేసారు.

ఘనంగా మాడుగుల శ్రీ మోదకొండమ్మ జాతర

విశాలాంధ్ర - విమాడుగుల : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం ,చల్లని తల్లి మాడుగుల గ్రామ దేవత శ్రీ మోదకొండమ్మ వారి జాతరను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టు వస్త్రములతో అలంకరించడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండి శ్రీ మోదకొండ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది. భక్తులను అదుపులో ఉంచడం ఒక దశలో పోలీసులు కూడా కష్టంగా మారింది. ఆలయం వద్ద తప్పిట గుళ్ళు, కవాలి డాన్సులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వార్త డప్పుల వాయిద్యాలు, నేల వేశాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. వచ్చిన భక్తులకు తాగునీరు ,చల్లని మజ్జిగ, అన్నదానాలను మరికొందరు భక్తులు పంపిణీ చేశారు. శ్రీ మోదకొండమ్మ వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పివిసి కుమార్ , మల్లు నాయుడు వంటి పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా భారీ సిబ్బందితో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అవివాహితపై అత్యాచారం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జిల్లాలో కసింకోట మండలం పల్లపు సోమవరంలో అవి వాహితపై అత్యాచారం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్సై రవికుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అవివాహితను అదే గ్రామానికి చెందిన కరణం వెంకట నాగేంద్రబాబు అనే యువకుడు అత్యాచారం చేసినట్టు సదరు వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కరణం వెంకట నాగేంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని తెలి పారు. సోమవారం సాయంత్రం 04.30 గంటలకు సోమవరం గ్రామానికి చెందిన 19 సం.ల అవివావిాత నర్సింగ బిల్లి గ్రామం లో నిల బడి ఉండగా అదే గ్రామానికి చెందిన కరణం వెంకట నాగేంద్ర బాబు అనే యువ కుడు ఆమె దగ్గరకు వెళ్ళి తన బైక్ ను ఆపి ఆమెతో మాట్లాడి ఆమెను బలవంతంగా బైక్ ఎక్కించుకుని నర్సింగబిల్లి రైల్వే గేట్ దాకా తీసుకొని వచ్చి అక్కడ నుండి పక్క రోడ్లోకి తీసుకువెళ్లి అక్కడ రైల్వే అండర్ పాస్ దగ్గర బండి ఆపి ఆమెను లోపలకు బలవంతంగా లాక్కెళ్లి అక్కడ బలవంతం చేసినట్లు ఫిర్యాదు అందింది అన్నారు. సదరు విషయమై బాదితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా కశింకోట ఎస్సైఏ. ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటల సమయములో కశింకోట మండలం పల్లవు సోమవరం గ్రామంలో పై కేసులో ముద్దాయి అయిన కరణం వెంకట నాగేంద్ర బాబు ను పల్లపు సోమవారం గ్రామంలోని తన ఇంటి వద్ద ఉండగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం ముద్దాయిను అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

సామాజిక సమస్యలపై అవగాహన

విశాలాంధ్ర - మల్కాపురం : సాంస్కృతిక అంశాలైన నాటికలు, నృత్యాలు, కళారూపాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించాలని జాతీయ సేవా పథక కార్యకర్త కె.లావణ్య అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం ఆమె చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ- సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని రూపుమాపడానికి కళారూపాలను ఉపయోగించుకోవాలని అన్నారు. అందుకే చిన్నారులు మరియు యువకులు చిన్న చిన్న నాటికలను, నృత్య రూపకాలను నిరంతరం అభ్యసించాలని అన్నారు. సమావేశానికి ప్రముఖ కవి కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ మాట్లాడారు. అనంతరం చిన్నారులకు నాట్యంలో శిక్షణను లావణ్య ఇచ్చారు. ఈ సందర్భంగా లావణ్యను జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అభినందించారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలెన్నో...

-10వ తరగతి పాసైన విద్యార్థులు ఐటిఐలో చేరేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి
-తక్కువ సమయంలో ఉపాధి ఐటిఐతోనే సాధ్యం - విజన్ ఐటిఐ సెక్రటరీ అండ్ కరస్పాండెంటు జేవీ ప్రభాకర్

విశాలాంధ్ర - పాయకరావుపేట: తక్కువ సమయంలో ఉపాధి పొందేందుకు సులువైన మార్గం ఐటిఐ ఒక్కటేనని పట్టణంలోని విజన్ ఐటిఐ సెక్రటరీ అండ్ కరస్పాండెంటు జేవీ ప్రభాకర్ తెలిపారు. విజన్ ఐటిఐ విశిష్టతను మంగళవారం స్థానిక విలేఖర్లకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లి రూరల్ జిల్లాలో ఉన్న ఐటిఐలో అతిపెద్దది విజన్ ఐటిఐ అని తెలిపారు. సుమారు రూ.5కోట్లతో మౌలిక సదుపాయాలు విద్యార్థుల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు జిల్లాల్లో ఎక్కడ లేని విధంగా ఆన్‌లైన్ పరీక్షల కోసం కంప్యూటర్ ల్యాబ్ విజన్ ఐటిఐలోనే ఉందని తెలిపారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసుకునేందుకు అత్యాధునికమైన పరికరాలు విజన్ ఐటిఐలో అందబాటులో ఉంచామని తెలిపారు. ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధనలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సులో ఎలక్ట్రికల్ 60సీట్లు, ఫిట్టర్ 80సీట్లు, ఏడాది కోర్సులో డీజిల్ మెకానిక్ 40సీట్లు విజన్ ఐటిఐలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గత ఏడాది విజన్ ఐటిఐలో చదువుకున్న విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అంతేగాక విజన్ ఐటిఐలో చదువుకున్న విద్యార్థులకు జయభేరి, స్టీల్‌ప్లాంట్, డక్కన్, హెటిరో తదితర వాటిల్లో అప్రంటీసు చేస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన పేద విద్యార్థులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఐటిఐ వైపు మొగ్గు చూసి తక్కువ సమయంలో ఉపాధి మార్గాలు ఎంచుకోవచ్చని తెలిపారు. అలాగే ఐటిఐ చదువుకున్న వారు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, విదేశాల్లో విద్య అభ్యసించే అవకాశాలు ఉన్నట్లు జేవీ ప్రభాకర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఆర్థికంగా వెనుకబడిన ఓసీ విద్యార్థులకు ఫీజు రియంబెర్సుమెంటు అవకాశం విజన్ ఐటిఐలో ఉన్నట్లు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధనలు చేస్తూ వందలాది మంది విద్యార్థులకు పలు పరిశ్రమలు, షోరూంలలో ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత విజన్ ఐటిఐకి ఉందని జేవీ ప్రభాకర్ తెలిపారు.

రామచంద్రపురంలో దొంగతనాలపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - గొలుగొండ : గొలుగొండ మండలం రామచంద్రపురం గ్రామంలో గడచిన రెండు రోజుల క్రితం దొంగతనం జరిగిన ఎలిశెట్టి రత్నం ఇంటిని క్లూస్ టీం సిబ్బంది. సందర్శించి. గ్రామంలో ఉన్న కొంత మంది యువతీ యువకుల వేలి ముద్రలు సేకరించి. వారితో. కృష్ణా దేవి పేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర ఆధ్వ ర్యంలో దొంగత నాలపై మంగళ వారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ వేసవి కాలంలో ప్రజలందరూ అప్ర మత్తంగా ఉండాలని మీరు ఏ ఇతర గ్రామాలకు కానీ. తీర్థయాత్రలకు గాని వెళ్లినట్లయితే పోలీసులు కు సమాచారం అందించాలని. అందించిన ఎడల ఆయా గ్రామాలలో మేము గస్తీ నిర్వహిస్తామని ప్రజల ఆస్తి రక్షణ కొరకే పోలీసు సిబ్బంది పనిచేస్తుందన అన్నారు. అలాగే మీ దగ్గర అధికంగా బంగారం కానీ డబ్బులు గానీ ఉంటే బ్యాంకు లాకర్లలో దాచుకున్న ఎడల మీ ఆభరణాలు ధనము రక్షణలో ఉంటుందని. ప్రయాణాలలో అశ్రద్ధ వహించరాదని చైన్ స్నాకింగ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని. ఎస్సై ఎం ఉపేంద్ర తెలియజేశారు. ఈ సంద ర్భంగా నర్సీపట్నం క్లూస్ టీం సిబ్బంది. (హెచ్‌సి) కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో నివసిస్తున్న వారు. ఇరుగు పొరుగు వారితో సన్నితంగా మెలగాలని. ఎవరైనా ఊరు వెళ్లినట్లయితే. ఇరుగు పొరుగు వారితో ఇల్లు చూడాలని చెప్పి వెళ్లాలని. మీ గ్రామ పరిధిలో కుక్కల్ని పెంచడం అలవాటు చేసుకోవాలని. చిన్నపిల్లలకు బైక్ డ్రైవింగ్ ఇవ్వకూడదని అలా చేసిన తల్లిదండ్రులకు శిక్ష పడే అవకాశం ఉందని. మీ ఫోన్ లకు ఎవరైనా అపరిచితులు ఫోన్లు చేసి ఆధార్ నెంబర్లు కానీ. బ్యాంకు ఎకౌంటు నెంబర్లు కానీ. మీ ఫోన్‌లోకి వచ్చిన ఓటీపీ నెంబర్లు కానీ. అడిగిన ఎవరికి చెప్పకూడదని. అలాగే మీకు ఏమైనా అనుమానం ఉన్నట్లయితే 1930కి సమాచారం అందించాలని. ఎవరినన్నా ఆడవారిపై అగైత్యాలు జరిగినట్లయితే 112. దిశ యాప్ కు సమాచారం ఇవ్వాలని. వేసవికాలంలో ఆరు బయట నిద్రించే వాళ్లు ఇంటి చుట్టూ ఉన్న లైట్లను వేసి ఉంచాలని. తెలియజేశారు. ఈ గ్రామమే కాకుండా నర్సీపట్నం సబ్ డివిజన్లో ఉన్న పది పోలీస్‌స్టేషన్లో పరిధిలో. దొంగతనాలు జరగకుండా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఈ కార్య క్రమంలో వెంటనే 100కి సమాచారం ఇవ్వాలని ఆయన తెలియ జేశారు ఈ కార్యక్రమంలో. నర్సీపట్నం క్లూస్ టీం సిబ్బంది. భరతుడు. పి యుగంధర్. కృష్ణా దేవి పేట పోలీసు సిబ్బంది. ద్వారపురెడ్డి దుర్గాప్రసాద్. కే.వెంకటేష్. రామ చంద్రపురం గ్రామ ప్రజలు. యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారులు కమ్యూనికేషన్‌తోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి

ఎంపీపీ జెడ్పీటీసీ ఏఎంసీ చైర్‌పర్సన్

విశాలాంధ్ర - కొయ్యూరు : రహదారులు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటిసి వారా నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ పేర్కొన్నారు. మండలంలోని నల్లగొండ పంచాయతీ అత్యంత మారుమూల బోయఊట గ్రామానికి రహదారి నిర్మాణం, నల్లగొండ గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులకు ఎంపీపీ బడుగు రమేష్ జడ్పిటిసి నూకరాజు ఏఎంసి చైర్ పర్సన్ రాజులమ్మలతో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇటీవల కొయ్యూరులో పర్యటించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని కలిసిన బోయఊట గ్రామస్తులు తమ గ్రామానికి రహదారి విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించుకుని వినతి పత్రం అందజేశారన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వెనువెంటనే గ్రామానికి వెళ్లి పూర్తి స్థాయిలో సమస్యలు తెలుసుకుని నివేదించాలని ఆదేశించడంతో మూడు రోజుల క్రితం ఎంపీపీ రమేష్ పార్టీ మండల అధ్యక్షుడు బాబులు ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ జడ్పిటిసి నూకరాజులు ఆ గ్రామాన్ని సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయడంతో అక్కడ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. దీంతో ఉపాధి హామీ పథకంలో గ్రామానికి రహదారి మంజూరు చేస్తూ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే నెల రోజుల్లో గ్రామానికి విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామని ఎంపీపీ రమేష్ వారికి హామీ ఇచ్చారు. సమస్యను తెలిపిన పది రోజుల్లోనే పరిష్కార చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి మండల వైసీపీ నేతలకు బోయఊట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అలాగే నల్గొండ కొత్త వీధి గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామస్తుల విన్నపం మేర త్వరితగతిన చర్యలు చేపడతామని నేతలు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ఏజెన్సీ డీఈఓ గా మల్లేశ్వరావు కు ఉద్యోగోన్నతి

విశాలాంధ్ర - దేవీపట్నం : ఇంత వరకు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం మండల విద్యాఖాధికారిగా పని చేసిన వై.మల్లేశ్వర రావు రంప చోడవరం ఏజెన్సీ డీఈఓగా పదోన్నతి పొందారు. ఈయన ఎమ్ ఈఓగా అడ్డతీగల, గంగవరం, దేవీపట్నం ఎమ్ఈ ఈఓగా ఏక కాలంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సంద ర్భంగా అల్లూరి జిల్లా దేవీపట్నం మండల యూటీఫ్ సభ్యులు మంగళవారం ఆయన్ని కలసి అభినందనలు తెలిపారు. ఈ కార్య క్రమంలో భాగంగా అధ్యక్షులు పి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సీనియర్ కార్యకర్తలు తాతారావు గారు ఎం నాగన్న దొర పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ లేక అవస్థలు పడుతున్న గిరిజనులు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని కొల్లాపూటు పంచాయితీ గ్రామాలకు చెందిన బీవీప్రజలు సెల్ సాంకేతలు అందక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. వైయస్ ఆర్ బీమా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకం లబ్ధి కొరకు స్థానిక వాలంటరీ దగ్గర తంబు వేసుకునుటకు కిలోమీటర్ మేరా కొండలు గుట్టలు ఎక్కవలసిన దుస్థితి ఏర్పడుతుందని, సెల్ సిగ్నల్ కోసం గంటలు తరబడి వేసి ఉండవలసి వస్తుందని, ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏ పథకం పొందాలన్నా సెల్ సిగ్నల్ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. సంబంధిత ఉన్నత అధికారులు పంచాయితీలో సెల్ టవర్ మంజూరు అయిందని చెప్పారు.కానీ ఇప్పటివరకు సెల్ టవర్ కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయితీలో సెల్ టవర్ మంజూరు చేసి గ్రామ ప్రజలకు సెల్ సంకేతాలు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపడతారని పంచాయితీ ప్రజలు కోరుతున్నారు.

సమిష్టి నిర్ణయాలతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - చింతపల్లి : ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సమిష్టి నిర్ణయాలతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. చింతపల్లి ఎంపీడీవోగా నూతనంగా నియమితులైన ఆశాజ్యోతి, ఎంపీపీని తన చాంబర్లో మంగళవారం పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ఆశాజ్యోతిని ఎంపీపీ దుస్సాలువతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారుల సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని, వైకాపా ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందే విధంగా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను సమన్వయం చేస్తూ మండల అభివృద్ధిలో ముందుండే విధంగా సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుదామని ఆమె ఎంపీడీవో ఆశాజ్యోతితో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు తదితరులు ఉన్నారు.

వర్షానికి, గాలి బీభత్సానికి విరిగి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



విశాలాంధ్ర - చింతూరు : చింతూరు మండలంలోని రామన్నపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం గాలి బీభత్సంతో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈ వర్షం,గాలి దాటికీ గ్రామ సర్పంచ్ పుసం వెంకటలక్ష్మికి చెందిన రెండు ఇళ్ళ పైకప్పులు లేచి పోయాయి. మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయి. ట్రాన్స్ఫర్మర్ నేలకొరిగింది. దీంతో విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలిగింది. అంతేగాక భారీ మామిడి వృక్షం విరిగి నేలకొరిగింది. మామిడి కాయలు రాలి పోయాయి. ఇళ్ల పై కప్పు కొట్టుకుపోవడంతో నిరాశ్రయులయ్యారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

11న జీ తెలుగులో చార్లీ 777, డ్రామా జూనియర్స్ ప్రసారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న ఫన్ అండ్ ఎమోషనల్ డ్రామా చార్లీ 777ని వరల్డ్ ప్రీమియర్ గా జీ తెలుగు చానల్ లో ఈ ఆదివారం ప్రసారం కానందని, అలాగే చిన్న పిల్లల్లోని టాలెంటిని ప్రోత్సహిస్తూ సక్సెస్ ఫుల్ రియాలిటీ షో డ్రామా జూనియర్స్ తదుపరి సీజన్ 6 కూడా వస్తుందని ఆ ఛానల్ ప్రతినిధి వెల్లడించారు. ప్రముఖ నటీనటులు జయప్రద, బాబు మోహన్ శ్రీదేవి విజయ్ కుమార్ ఈ షోకు జడ్జిలుగా వ్యహరించనున్నారన్నారు. తెలుగు టెలివిజన్ చరిత్రలో సీనియర్ హీరోయిన్ జయప్రద మొదటిసారి డ్రామా జూనియర్స్ సీజన్ 6తో బుల్లితెరపై కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారన్నారు. చార్లీ 777 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు, డ్రామా జూనియర్స్ సీజన్ 6, జూన్ 11న ప్రారంభం అయ్యి, ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, జీ తెలుగులో ప్రసారమవుతుందని చెప్పారు.

వెలుగులోకి నాసిరకం దగ్గు సిరప్‌లు..లైసెన్సింగ్ విధానం మరింత కఠినం

విశాలాంధ్ర/విశాఖపట్నం : గత నెలాఖరులో, పంజాబ్‌లో తయారైన దగ్గు సిరప్‌లపై డబ్ల్యుహెచ్‌ఓ 'ఉత్పత్తి హెచ్చరిక' (ప్రోడక్ట్ అలర్ట్)ను ఎలా అధికం చేసిందో అనేక వార్తలు వచ్చాయి. ఈ వాస్తవాన్ని సీడీఎస్‌సీఓ ధ్రువీకరించింది. దగ్గు సిరప్‌లలో విషతుల్యమైన డైథైలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ 'ఆమోదించలేని పరిమాణంలో' ఉన్నట్లు వెల్లడైంది. ఇది గత సంవత్సరం అక్టోబర్‌లో భారతదేశంలోని మరొక రాష్ట్రం నుండి వచ్చే దగ్గు సిరప్‌లపై వైద్య హెచ్చరికను జారీ చేయడం, పశ్చిమ ఆఫ్రికా దేశమైన గాంబియాలో పిల్లల మరణాలకు ఆ సిరప్ కారణమైన సంఘటనను గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో సెక్షన్ 16 కింద ఐసోప్రొపైల్ ఆల్కహాల్ లేదా ఐపీఏ వాడకంపై, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 రెండవ షెడ్యూల్ ప్రకారం ప్రోటోకాల్‌ల నిరంతర ఉల్లంఘనపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం వుంది. ఐపీఏ అనేది రంగులేని, గాఢమైన వాసనతో మండే ద్రవం. బల్క్ డ్రగ్స్, డ్రగ్ ఫార్ములేషన్‌ల తయారీలో విస్తృతంగా ఉపయోగించే ద్రావకం లేదా ఎక్సిపియెంట్. ఇది హ్యాండ్ శానిటైజర్‌లు, యాంటిసెప్టిక్స్, క్రిమిసంహారకాలు వంటి ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో ఔషధ తయారీదారులు ఇండియన్ ఫార్మకోపోయియా లేదా మరే ఇతర దేశంలోని ఫార్మాకోపోయియాలో పేర్కొన్న గుర్తింపు, స్వచ్ఛత, శక్తి ప్రమాణాలను పాటించేలా చూసేందుకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఒక సర్క్యులర్‌ను విడుదల చేసింది. దాదాపు అదే సమయంలో, సీడీఎస్‌సీఓ 48 సాధారణంగా ఉపయోగించే మందులపై హెచ్చరికలు జారీ చేసింది.

ఎంపీటీసీ బుల్లి ప్రసాద్ మాట నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

విశాలాంధ్ర - గొలుగొండ : అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏఎల్ పురం 3వ. సెగ్మెంట్ వైసిపి ఎంపిటిసి బుల్లి ప్రసాద్ సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడడం పద్ధతి కాదని మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ హెచ్చరించారు నీవు బుల్లి ప్రసాద్‌వా బొల్లి ప్రసాద్‌వా అని ఎద్దేవా చేశారు నీవు చెప్పే సొల్లు గ్రామంలో అందరికీ తెలుసని అభివృద్ధి చేయడం చేతకాని మీకు ఈ పదవులు అనవసరమని తీవ్రంగా విమర్శించారు నేను జడ్పిటిసిగా ఏ ఎల్ పురం గ్రామంలో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు అంతే కాకుండా తన సొంత నిధులతో గొల్ల వీధిలో మంచినీటి బోరు 8 లక్షల రూపాయలతో హైస్కూల్లో గ్రౌండ్ లెవెలింగ్, హైస్కూల్లో డిజిటల్ కంటైనర్ కొరకు లక్ష 80 వేల రూపాయలతో ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు అలాగే అల్లూరి సీతారామరాజు పార్కులో 15 వేల రూపాయలతో మంచినీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు మండలంలో ప్రతి పంచాయతీకి జడ్పీ నిధులతో అభివృద్ధి చేసిన ఘనత నాకు ఉందని. అభివృద్ధిలో పోటీ పడాలితప్పితే వ్యక్తిగత దూషణలకు వెళ్ళకూడదు అన్నారు నీకు జడ్పిటిసి కి. ఎంపీటీసీకి తేడా తెలియని మనిషివి. నీకు ఏమైనా గ్రామం మీద అవగాహన ఉంటే అభివృద్ధిలో పోటీపడి ప్రజల మన్ననలు పొందాలి కానీ. మమ్మల్ని తిట్టినంత మాత్రాన. నీకు ఒరిగేది ఏమీ లేదని ఇకనుంచి అయినా బుద్ధిగా ఉంటే మిమ్మల్ని గౌరవిస్తామని. నీ సెగ్మెంట్లో పారిశుద్ధ్యలోపం చాలా తీవ్రంగా ఉంది అని ప్రజలు గొగ్గోలు పెడుతున్నారు నీకు చేతనైతే నీ సొంత నిధులతో అయినా సరే పనులు చేయించు. విమర్శలు మానుకో లేదంటే మాకు తిట్టడం విమర్శించడం చాలా బాగానే వచ్చని ఈ విషయం మీరు చాలా బాగా గుర్తు పెట్టుకోవాలని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ మండల కార్యదర్శి. శేఖర్. అల్లు రాజబాబు పాల్గొన్నారు.

పోలవరం సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాధవి

విశాలాంధ్ర - కొయ్యూరు : పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు సమీక్ష సమావేశానికి అరకు ఎంపీ గుడ్డేటి మాధవి హాజర య్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని శర వేగంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయమై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. సమీక్ష సమావేశానికి హాజరైన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని పోలవరం డ్యామ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల పలు సమస్యలను ఎంపీ మాధవి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

మాతృశ్రీ గండి పోచమ్మ ను దర్శించుకున్న ఎంపీ మాధవి

పోలవరం పర్యటనలో భాగంగా జిల్లాలోని దేవీపట్నం మండలంలో ప్రసిద్ధిగాంచిన మాతృశ్రీ గండి పోచమ్మ తల్లిని స్థానిక శాసన సభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి తో కలిసి ఎంపీ మాధవి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ ఎమ్మెల్యేలకు ఆలయ అర్చకులు సిబ్బంది ఘన స్వాగతం పలుకుతూ సాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కొయ్యూరు : పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వ హించారు. పార్టీ మండల అధ్యక్షుడు గొలిసింగి సత్యనారాయణ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, తెదేపా సీనియర్ నేత వరహాలు బాబు తదితరుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి జన్మదిన పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేస్తూ నిరంతరం మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి శ్రమిస్తున్నారని కొనియాడారు. తరతమ బేధాలు లేకుండా చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆమెకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సన్యాసిరావు, సవిర్ల సత్తిబాబు, పందు తెదేపా నేతలు కొర్ర పుల్లయ్య కునిశెట్టి చంద్రరావు వెంకటరావు తదితర పలువురు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలపై చిన్నచూపు

విశాలాంధ్ర - కొయ్యూరు : స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను ఆదుకోవటంలో పాలకులు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సామాజిక సేవకులు అర్జున్ రెడ్డి ఆరోపించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ముఖ్య అనుచరులైన మండలంలోని నడింపాలెం సమీప లంకవీధిలో నివాసం ఉంటున్న గిరిజన స్వాతంత్ర సమరయోధులు గాం గంటందొర, గాం మల్లుదొరల కుటుంబాలు నేటికీ పేదరికంలోనే మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడలేని ఆయా కుటుంబాలకు గూడు కల్పించడంలో విఫలమైన అధికారులు పాలకులు విగ్రహాల ఏర్పాటుతో ఆయా కుటుంబాలను మోసగిస్తున్నారని ఆరోపించారు. నేడు గంటందొర వర్థంతి సందర్భంగా అతని విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సంకల్పించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను ఆర్భాటంగా పొగుడుతూ సన్మానించడం తప్పితే వారి బాగోగులు పట్టించుకునే వారే లేరని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్వాతంత్ర సమరవీరుల త్యాగాలను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని అర్జున్ రెడ్డి హితవు పలికారు.

భారతీయ జనతా పార్టీ అత్యవసర సమావేశం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనంద పురం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు ఆధ్వర్యంలో వేముల వలస గ్రామం లో సమావేశం జరిగింది. దేశ ప్రధాని నరేంద్ర మోడీజీ 9సం.ల సుపరిపాలనను ప్రజలలోకి తీసుకెళ్లే క్రమంలో 30 రోజుల పాటు చేసే కార్యక్రమాల లో భాగంగా ఈ నెల 11వ తేదీన కేంద్ర హెూంశాఖ మరియు సహకార శాఖ మంత్రివర్యులు అమిత్ షా విశాఖ విచ్చేస్తున్న సందర్భంగా ఆ యొక్క బహిరంగ సభ కార్యక్రమాల ఏర్పాట్లు కొరకు ఈ రోజు అనగా 6/6/2023 ఉదయం 10గం.లకు భారతీయ జనతా పార్టీ ఆనందపురం మండల ముఖ్య నాయకుల సమావేశము జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, రొంగల గోపీ శ్రీనివాస్, హాజరయ్యారు. బిజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, బిజేపి కిసాన్ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షులు పి.వి.వి. ప్రసాద రావు పట్నాయక్, భీమిలి నియోజక వర్గం అసెంబ్లీ కన్వీనర్ - కె.రామ నాయుడు, ఓ.బి.సి.మోర్చా ఈస్ట్ గోదావరి జిల్లా కార్యదర్శి పట్నాల నాగార్జున, సిద్దని వెంకట్ ఉన్నారు.

క్రీడా మైదానంలో హైమాస్ట్ లైట్స్ ప్రారంభం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : నడుపూరు హై స్కూల్ పక్కనున్న కొత్త క్రీడా మైదానంలో సాయంత్రము నడకకు వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా చీకటి పడ్డాక ఎటువంటి అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా మూడు వారాల కిందట ఎలక్ట్రికల్ పోలులు ఏర్పాటు చేసి వాటికి హై మాస్ట్ లైట్స్ అమర్చడం జరిగింది. స్థానిక శాసన సభ్యులు శ్రీ తిప్పల నాగిరెడ్డి గారు మరియు 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భములో శాసన సభ్యులు శ్రీ తిప్పల నాగిరెడ్డి గారు మాట్లాడుతూ ఈ వార్డు అభివృద్ధి కోసం కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని, ఆవిడ పట్టుదలకు సహాయంగా రాజకీయాలకు అతీతంగా ఈ వార్డు అభివృద్ధికి అవసరం అయిన అన్ని నిధులు మంజూరు చేసిస్తున్నానని రానున్న కాలములో సుమారు రెండు కోట్ల రూపాయల మేర అభివృద్ధి కార్య క్రమాలకు శంఖుస్థాపన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ పెద్దలు, గౌరవ శాసన సభ్యులు శ్రీ తిప్పల నాగిరెడ్డి గారు మన వార్డు అభివృద్ధికి అందిస్తున్న సహాయ సహకారాలు కృత్తతలు తెలియ చేసారు, త్వరలోనే ఈ మైదానంలో మిగతా వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాట్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూస్తానని అన్నారు, అలాగే గౌరవ శాసన సభ్యులు పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై దృష్టి పెట్టాలి అని దానిని అప్గ్రేడ్ చేయించి 30పడకల ఆసుపత్రి నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, వివిధ రాజకీయ పక్షాల నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్ట రెడ్డి, గోందేసి శ్రీనివాసరెడ్డి రమణా రెడ్డి, పెదరెడ్డి, పెద్దాడ సోము నాయుడు, శ్రీముసిరి శ్రీనివాస రావు, దొమ్మేటి పెరుమాళ్, కనక రాజు పిట్ట గురునాథ్ రెడ్డి,అప్పన్న రెడ్డి, రాము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, సింహాద్రి, మురళి ఝాన్సీ రాణి, కిరణ్, రావు, వహీద్ అప్పారావు, పెంటయ్య, కోచ్ లు రెడ్డి, వెంకటేష్, మురళి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంతర్జాల, చరవాణి సంకేతాలు అందుబాటులోకి తేవాలి

విశాలాంధ్ర - చింతపల్లి : అంతర్జాల, చరవాణి సంకేతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బలపం పంచాయతీ ప్రజల సమస్య పరిష్కారానికి సంబంధిత ఉన్నత అధికారులు చొరవ చూపాలని బలపం పంచాయతీ సర్పంచ్ కే.రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు లబ్ధిదారులకు సకాలంలో తంబ్ వేయుటకు అంతర్జాల, చరవాణి సేవలు అందకపోవడం వలన లబ్ధిదారులంతా చరవాణి సంకేతాలు అందే, ఆ పంచాయతీ పరిధిలోని ఎర్రగుప్ప కూడలికి క్యూ కడుతున్నారన్నారు. గతంలో కోరుకొండ లో బిఎస్ఎన్ఎల్ సంకేతాలు అందేవని, ఎయిర్టెల్ టవర్ నిర్మాణం కొరకు రహదారికిరువైపులా గోతులు ఏర్పాటుచేసి ఫైబర్ వైర్ ఏర్పాటు చేయడం వలన బిఎస్ఎన్ఎల్ చరవాణి సంకేతాలు క్షీణించాయని అన్నారు. ఎట్టకేలకు ఎయిర్టెల్ టవర్ నిర్మాణం పూర్తి అయిందని, దీన్ని ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఈ ప్రాంత ప్రజలు, వినియోగదారులు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రస్తుతం వైకాపా ప్రభుత్వంలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు పారదర్శకంగా అందుతున్నప్పటికీ తమ ప్రాంతంలో అంతర్జాల, చరవాణి సంకేతాలు ఇబంది పెడుతున్నాయన్నారు. బలపం పంచాయతీ ప్రజల బీమా తంబ్ కోసం సచివాలయ కార్యదర్శి చిన్నం నాయుడు తో కలసి పంచాయతీ ప్రజలకు, వాలంటీర్స్ చేతులు మీదుగా దగ్గర ఉండి బీమా తంబ్ సర్వే నిర్వహించడం జరిగిందని సర్పంచ్ రమేష్ నాయుడు తెలిపారు.

మండల వ్యవసాయ శాఖ అధికారిగా ఉమాదేవి

విశాలాంధ్ర - కొయ్యూరు : మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా డి ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా మండల ఏవోగా నియమితులైన ఉమాదేవి మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన కృష్ణవేణి చీడి కాడకు బదిలీ అవటంతో ఆమె స్థానంలో ఎలమంచిలి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉమాదేవిని కొయ్యూరు ఏఓగా నియమించారు. దీంతో ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ సిబ్బంది ఆర్బీకే సిబ్బంది నూతన ఎంఏఓ ఉమాదేవిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్ర సిబ్బందితో సమావేశమైన ఏవో ఉమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్.బి.కెల ద్వారా రైతాంగానికి అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి మెరుగైన సేవలు అందించాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతాంగానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వ్యవసాయ సాగులో తగు మెలకువలతో పాటు రైతాంగానికి అవసరమైన సలహా సూచనలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ ఎంపీఈఓ సతీష్ విపిఏ లు, వీహెచ్ఏలు ఆర్ బికే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జిమాడుగుల : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్న ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతున్నామని పాడేరు శాసనసభ్యులు శ్రీమతి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. జి.మాడుగుల మండలం కోరాపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని లోకిటుముల, కిటుముల,తగ్గిమెట్ట,పాలకొండ, కోరాపల్లి -2,అరగడపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాడేరు శాసనసభ్యులు శ్రీమతి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 242 గడపలను శాసన సభ్యులు సందర్శించడం జరిగింది. ఆయా గడపలలో ఈ నాలు గేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు పొందడంలో పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. అర్హత ఉండి కూడా ఇప్పటికీ సంక్షేమ పథకాల పొందిన వారు ఉంటే గ్రామ సచివాలయంలో సంప్రదించి సంక్షేమ పథకాల పొందాలని సూచించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు శ్రీమతి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ గౌరవ ముఖ్య మంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తాము ప్రజల సమస్యలను నేరుగా తెలును కునేందుకు అవకాశం ఏర్పడిందని, ఈ సందర్భంగా గిరిజ నులందరి తరపున సీఎం గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రౌండ్ లెవెల్ లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై పూర్తి అవగాహన వస్తుందని ప్రతి సమస్య పరిష్కారానికి మార్గాలు అన్వేషించేలా గౌరవ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తమకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం ద్వారానే నేడు ప్రజలు తమకు తెలియజేస్తున్నటు వంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపగలుగుతున్నామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన గ్రామ సచివాలయాలకు అందించే రూ.40 లక్షలతో ఆయా గ్రామాలలో సమస్యల పరిష్కా రానికి వెచ్చిస్తున్నామని తెలిపారు. ముందుగా తాగునీటి సమస్య పరిష్కా రానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. మిగిలిన సమస్యలకు కూడా వీటి తర్వాత పరిష్కా రానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మసాడి రాజులమ్మ, స్థానిక ఎంపీటీసీ అంగనైని నానాజీ, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు సురభంగి రామకృష్ణ, సీదరి కొండబాబు, కే కోడాపల్లి సర్పంచ్ వెంకటరమణ, లవ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, మండల కన్వీనర్ లంకెల కళ్యాణ్, మసాడి గంగరాజు, సింగర్బ ఎంపిటిసి పాంగి చిట్టిబాబు, వంతల శివ, సింగర్బ కన్వీనర్ వండ్లపు సూర్య ప్రకాష్ నాయుడు, సీనియర్ నాయకులు వంతల కృష్ణారావు, మసాడి పెద్ద బాలన్న, జర్ర కొండబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంటందొర, మల్లుదొర కుటుంబీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

విశాలాంధ్ర - సీలేరు : గిరిజన స్వాతంత్ర సమరయోధుడు గాం గంటందొర, మల్లు దొర కుటుంబీకులకు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని భారతీయ ఆదివాసీల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గడుతూరి రాంగోపాల్ డిమాండ్ చేశారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ గిరిజన స్వాతంత్ర సమరయోధుడు గాం గంటందొర 99వ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం చేపట్టడం సంతోషకరమన్నారు. విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వాతంత్ర సముపార్జన కోసం బ్రిటిష్ సామ్రాజ్యంపై సాగించిన పోరాటంలో సేనాదిపతులుగా గాం గంటందొర ఆయన సోదరుడు గాం మల్లుదొర వ్యవహరించారన్నారు. వీరితో పాటు సుమారు 300 మంది గిరిజన యోధులు ఈ మన్యం పితూరిగా ప్రసిద్ధి చెందిన సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, గాం గంటందొర 1924 జూన్ 7 వల్లంపేట గ్రామంలో బ్రిటిషన్ సేనవల తుపాకి కాల్పుల్లో మరణించారన్నారు. చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజఒమ్మంగి, అడ్డతీగల, రంప చోడవరం, అన్నవరం, మల్కన్‌గిరి పోలీస్‌స్టేషన్లప దాడిలో గాం గంటందొర కీలకపాత్ర పోషించారన్నారు. గత సంవత్సరం అల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవాల సందర్భంగా భీమవరంలో అల్లూరి సీతారామరాజు భారీ నిలువెత్తు విగ్రహాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోది, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిలు గంటందొర మనవడు గాం బోడిదొరను సత్కరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాం గంటందొర, మల్లు దొర కుటుంబీకులకు, మన్యం పితూరిలో బ్రిటిష్ సేవలతో పోరాడుతూ వీరమరణం పొందిన గిరిజన స్వాతంత్ర సమరయోధుల కుటుంబీకులకు శాశ్వత నివాస గృహాలను ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారని, అయితే ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఆ దిశగా ఏ విధమైన ముందడుగు ఇప్పటి వరకు పడలేదన్నారు. ఈ స్వాతంత్ర సమర యోధులను వారి జయంతి, వర్ధంతి సందర్భంగా గుర్తు చేసుకుంటూ కీర్తించడం తప్ప వారు నడియాడిన ఉద్యమించిన ప్రదేశాలను స్మారక చిహ్నాలుగా అభివృద్ధి పరచడం, పేదరికంలో జీవితాలను గడుపుతున్న వారి వారసులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులుగా గిరిజన స్వాతంత్ర సమరయోధుడు గాం మల్లు దొర 1956 సంవత్సరంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికయ్యారన్నారు. విశాఖనగరంలో బీచ్ రోడ్డులో కనీసం భావితరాలు స్మరించుకునేలా గాం గంటందొర, గాం మల్లుదొర విగ్రహాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేదన్నారు. దీనిని బట్టి గిరిజన స్వాతంత్ర సమరయోధులను మన ప్రభుత్వాలు ఇచ్చే గౌరవం ఏపాటిలో మనకు అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన స్వాతంత్ర సమరయోధులు గాం గంటందొర, మల్లు దొర విగ్రహాలు విశాఖపట్నం నగరంలో, బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పాడేరులో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాలకి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్‌కు వీళ్ల పేర్లు పెట్టి గౌరవించాలన్నారు. భారతదేశాన్ని పరాయిపాలన నుండి విముక్తి చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యంపై పోరాడుతూ అమరులైన గిరిజన స్వాతంత్ర సమరయోధుల కుటుంబీకులు తమను ఆదుకొనే నాధుడు లేక నేడు కటిక పేదరికంలో జీవితాలను భారంగా వెళ్లదీస్తున్నారన్నారు. వీరందరిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని, వారికి నిర్మించి ఇస్తానన్న శాశ్వత నివాస గృహాలను వెంటనే నిర్మించి ఇవ్వాలని, అలాగే వీళ్ల కుటుంబంలోని అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ ఆదివాసుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరదాని గంగరాజు, మర్రి కామరాజు, సురగం సత్యనారాయణ, బద్నాయని విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నోటరీ అఫిడవిట్ దాఖలు చేయాల్సిన అవసరం లేదు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లాకలెక్టరు పాడేరు వారి ఆదేశముల మేరకు గ్రామ సచివాలయముల యందు అందించబడుతున్న సేవలు అనగా కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రములు, వెబ్ లాండ్ ఆడంగల్ 1బి నందు మ్యూటేషన్‌లు , లేట్ రిజిస్ట్రేషన్ జనన మరణ ధృవీకరణ పత్రముల మంజూరు కొరకు గ్రామ సచివాలముల యందు పిటిషనుదారులు ఎటు వంటి నోటరీ అఫిడవిట్ దాఖలు చేయవలసిన అవసరము లేదని స్థానిక తహసిల్దార్ ఎన్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.

సైన్స్ ఉపయోగాలపై అవగాహన

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం శాఖ గ్రంధాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంధాలయాధికారి చంద్ర కళ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ యొక్క ఉపయోగాలు, సైన్స్‌లో వింతలు, గ్రంథాలయంలో చదువుకొని వాటిలో ఉన్న మంచిని గ్రహించి స్నేహితులకు తెలియజేయాలని రిసోర్స్ పర్సన్‌గా త్రిమూర్తులు రెడ్డి తెలిపారు. అలాగే రీసెర్చ్ పర్సన్‌గా కె.భాస్కర్‌రావు చదవడం వల్ల ఉపయోగాలు, విద్యార్థిని విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్ పుస్తక సమీక్ష అనే రెండు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : దివంగతనేత శ్రీ బోడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులుతో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. దివంగతనేత శ్రీ బోడ్డేపల్లి రాజగోపాలరావు అభిమానులు ఆర్థిక సహాయంతో ఈ విగ్రహ ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు దుక్క రోజారాక్రిష్ణ, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నూక సత్యరాజు, బమ్మిడి గణపతిస్వామి, పేడాడ వెంకటరావు, అన్నెపు రామారావు, మెట్ట సింహాచలం, బల్లి కామరాజు, సీనియర్ న్యాయవాధి లఖినేని శ్రీనివాస్, ఉపాధ్యాయులు లఖినేని కరుణాకర్, ఎల్.వి. ప్రతాప్, జివి. రమణ, మెట్ట వేణు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేద్దాం

అరకు పార్లమెంట్ కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు

విశాలాంధ్ర - చింతపల్లి : 2024 సార్వత్రిక ఎన్నికలలో నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కలిసి పని చేద్దామని ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ కేంద్రంలో ఆ పార్టీ చింతపల్లి మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్య నారాయణతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు వేదికగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు నాయకులు కార్యకర్తలు తెదేపా అభిమానులు కృషి చేయాలన్నారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి అయినప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందర్భంగా తయారయ్యిందన్నారు. సంక్షేమం ముసుగులో ఈ ప్రభుత్వం సర్వం దోచేస్తుందని ఆరోపించారు. పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఏర్పడిన తెదేపా తిరిగి అధికారంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైకాపా ప్రభుత్వంలో నిత్యవసర ధరలు మొదలు వంట గ్యాస్, చమురు ధరలు విపరీతంగా పెంచారన్నారు. నాడు నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన అంటూ విద్యా వ్యవస్థను చిన్నభిన్నం చేశారన్నారు. నవరత్నాలు, సంక్షేమం పేరుతో నమ్మిన ప్రజలను నిలువునా మోసగించిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం పేరిట ప్రతి ఒక్క కుటుంబాన్ని కలుస్తు న్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతాలలో అభివృద్ధి ఎందుకు కుంటు పడిందో సమాధానం చెప్పాలన్నారు. మన్య ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లోనూ, ప్రధాన రహదారులలో సైతం గుంతలు పూడ్చలేని గుదిబండగా వైకాపా ప్రభుత్వం తయార య్యిందన్నారు.. మన్య ప్రాంతంలో ముఖ్యమైన వాణిజ్య పంటగా ఉన్న పసుపుకి గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయలేని వైకాపా ప్రభుత్వం రైతులకు అన్ని విధాల తమ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆదుకుంటున్నామని చెప్పడం అర్ధరహితం అన్నారు. ఇటువంటి తరుణంలో నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకు వచ్చేందుకు తెదేపా శ్రేణులంతా కలిసి పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

చింతూరులో వర్షం.. చల్లబడ్డ వాతావరణం

విశాలాంధ్ర - చింతూరు : చింతూరులో మంగళవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల నుండి అగస్మాతుగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. 42 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎండవేడిమి కి వుక్క పోతపోసి తట్టు కొలేని ప్రజలకు కొంత వూరట కలిగింది. వాతావరణం చల్లబడి సేద తీరినది.

సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి ఉయీక కన్నారావు మృతి

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం వేకవారిగూడెం గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి ఉయక కన్నారావు మంగళవారం ఆరోగ్య బాగా లేక మృతి చెందారు. మండల సిపిఎం పార్టీ బృందం కన్నారావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు సీసం సురేష్ ఎర్రంశెట్టి శ్రీనివాస్ పల్లవు వెంకట్ మాట్లా డుతూ నిరంతరం ఉయక కన్నారావు గ్రామంలో పార్టీ కోసం కృషి చేశారని, నిరంతరం పార్టీ పిలుపుమేరకు ముందుండి నడిచేవారన్నారు. అతి చిన్న వయసులో చనిపోవడం సిపిఎం పార్టీకి తీరని లోటు. ఆయన ఆశలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తామన్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో ఉప్పరాపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 5 మట్టి ట్రాక్టర్లు ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ శ్యామ్ అందించిన వివరాల ప్రకారం చెరువు నుంచి మట్టి తరలింపు జరుగుతుందని తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. దీంతో 5 ట్రాక్టర్లు సీజ్ చేసి పోలీసుస్టేషన్ తరలించినట్లు తెలిపారు. అలాగే దార్లపూడి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడు ఎడ్ల బండ్ల ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆధరణ పథకం డీడీలు తిరిగి ఇవ్వాలి : మత్స్యకారులు

విశాలాంధ్ర - యస్.రాయవరం : గత టిడిపి ప్రభుత్వం హయాంలో ఆధారణ పథకం లో భాగంగా మత్స్యకారులు వల్లలు కోసం డిడి రూపంలో ఇచ్చిన నగదును చెల్లించాలని మత్స్యకారులు ఎంపిడిఓ రామచంద్రమూర్తి కు వినతిపత్రం అందజేశారు. మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో మత్స్యకారులు ఎంపిడిఓ కార్యాలయం లో ఎంపిడిఓ ను కలిసి రేవుపోలవరం గ్రామం నుంచి 80 మంది పైగా డిడి రూపంలో ఇచ్చామని ఈ ప్రభుత్వం వల్లలు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే మత్స్యకారులు ఇచ్చిన డిడి తిరిగి ఇవ్వాలని కోరారు. ఎంపిడిఓ స్పందిస్తూ కొంతమంది డిడి లకు సంబంధించిన నగదు ప్రత్యేక అకౌంట్ లో ఉన్నాయని మిగతాయి త్వరలో వస్తాయని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడ లోవరాజు,గంపల అప్పన్న, ఎరిపల్లి రమనబాబు,చేపల గోవిందు, గనగల్ల గోపాల కృష్ణ,ఏరివల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - పెందుర్తి : ఐసిడిఎస్ పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిడి పి.వెంకటేశ్వరి తెలియజేశారు. మొత్తం తొమ్మిది పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో సాయిరాం నగర్, గొరపల్లి, నాతయ్యపాలెం-1 పోస్టులు ఎస్టీలకు, జోగవానిపాలెం, మురుబాయి, యారాడ ఎస్సీలకు, కనితి కాలనీ ఈడబ్ల్యూఎస్ కు, దుర్గా నగర్ బిసి-డి, గొడ్డువాని పాలెం బిసి-ఈ కేటగిరీ లకు రిజర్వ్ అయినట్లు పిడి తెలియజేశారు. అర్హులైన వారు ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రత్యక్షంగా గాని పోస్టులో గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా కేంద్రాలలో స్థానికంగా నివాసం ఉండే 21 సంవత్సరాలు నిండిన మహిళలు అర్హులని, వారు లేకుంటే 18 సంవత్సరాల నిండిన మహిళలకు ప్రాధాన్యతనిస్తామని వెల్లడించారు.

7న గిడుతూరులో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలం గిడుతూరులో బుధవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పర్యటించ నున్నారని వైసిపి మండలాధ్యక్షులు రుత్తల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఉదయం 9 గంటల నుంచి గిడుతూరులో గడపగడపకు పర్యటిస్తారన్నారు. కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

రహదారి కోసం శ్రమదానం

విశాలాంధ్ర - జికేవీధి : అధ్వాన రహదారిని బాగు చేయాలని చీడిగొంది గ్రామస్థులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నారు. ఏడాది క్రితం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీని కలిసి తమ గోడును వినిపించారు. అయితే ఏడాది గడిచినా ఎటువంటి స్పందన లేకపోవడంతో గ్రామస్థులు శ్రమదానంతో రహదారిని బాగు చేసుకున్నారు. జికేవీధి మండల కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో దేవరాపల్లి పంచాయతీకి చెందిన చీడిగొంది గ్రామం ఉంది. గ్రామంలో 60 ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది కిందట గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీని చీడిగొంది గిరిజనులు కలిసి రహదారిపై ఏర్పడిన గోతుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రహదారికి మరమ్మత్తులు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆనందించారు. అయితే సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఏడాది గడిచిపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో తామే రహదారిని బాగు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం ప్రధాన రహదారి నుంచి గ్రామాన్ని కలిపే సుమారు 3.5కిలో మీటర్ల రహదారిని శ్రమదానంతో బాగు చేసుకున్నారు.

రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి జనసేన ఘన నివాళి

విశాలాంధ్ర - ఆనందపురం : అనందపురం జంక్షన్ లో జనసేన పార్టీ భీమిలి ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం తరపున ఆనందపురం మండలం వేములవలస జంక్షన్ లో నివాళులర్పించి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు అనంతరం ఇన్చార్ సందీప్ మాట్లాడుతూ ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం విషయం యావత్ ప్రపంచాన్ని కలిసవేసిందని వారి ఆత్మకు శాంతి కలగాలని మరల ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన పార్టీ నాయకులు శాఖరి శ్రీనుబాబు,మజ్జి శ్రీను,దుక్క వెంకటరావు, తాడివాడ శివకృష్ణ,బొద్దాపు గోవింద్,కొయ్య నాని, బాలు, అల్తి రాజు, ఆకుల అభి, ఎల్ నాని,కుప్ప రామలక్ష్మి, రఘు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - హుకుంపేట : భగ భగ మండే ఎండలోను సైతం లెక్క చేయకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు మారుమూల గ్రామల్లో అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పర్యటిస్తున్నారు. గడప గడపకు వెల్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా మండలంలోని మత్యపురం పంచాయితీ రాళ్ళగెడ్డ, తంబిడిపుట్టు, సెంబి, కొత్తవలస, బంగారుమెట్ట గ్రామల్లో ఆయన ఉదయం నుంచి ఎండను సైతం లెక్క చేయకుండా 268 గడపలకు వెల్లి సంక్షేమ పధకాలపై వివరిస్తు ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఆయ గ్రామల్లో ఎమ్మెల్యే కు పెద్ద ఎత్తున పూలమాలతో ఘ నంగా స్వాగతం పలికారు. సెంబి, బంగారు మెట్ట గ్రామల్లో సీసీ రోడ్డు,అంగన్వాడి భవనం మంజురు చేయాలని, పెద బూరుగులలో రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. ఎమ్మెల్యే స్పందించి కొద్ది రోజుల్లోనే సమస్య ను పరిస్కారిస్తానని హామీ ఇచ్చా రు.గ్రామల్లో మౌళిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. నిరంతం ప్రజల మధ్యలో ఉంటు తమకు ఏమి కావా లో అన్ని సౌకార్యాలు కల్పిస్తామ న్నారు. మృతుని కుటుంబానికి పర మార్శ పెదబూరుగులు గ్రామంలో పాంగి కృష్ణారావు అనే వ్యక్తి గుండేపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకుని, మృత దేహం వద్ద నివాళిలు అర్పించారు. అనంతరం కుటుంబానికి పరమార్శించారు. కుటుంబాన్ని ఆదుకుంటానని అన్నారు. ఈ క్యార్యక్రమంలో జిల్లా వాణిజ్యా విభాగం అధ్యాక్షుడు ఒంటుబు సామ్యేల్, కోపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ కే.రామకృష్ణా, సర్పంచ్లు పూజరి మేరి, సమిడ వెంకటపూర్ణిమ, పాంగి సింహాచలం,లక్ష్మయ్య, ఎంపిటీసీ సభ్యురాలు కిల్లో మీనా నాయకులు అనిల్. సుబ్బారావు, వెంకట్. మహేష్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలు మహిళల ఆరోగ్యానికి రక్ష

విశాలాంధ్ర - చింతపల్లి : పొగరాని పొయ్యిలు మహిళల ఆరోగ్యానికి రక్ష అని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మహిళల ఆరోగ్య రక్షణ రీత్యా, కాలుష్య నియంత్రణను దృష్టిలో పెట్టుకొని క్రాఫ్ జోన్ సంస్థ మన్య ప్రాంతంలో పొగరాని పొయ్యిలు పంపిణీ చేయాలనే ఆలోచనతో స్థానిక పంచాయతీ పరిధిలోని క్రాఫ్ జోన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) సాయిబాబా ఆధ్వర్యంలో కందులగాదే గ్రామంలో ఏర్పాటు చేసిన పొగరాని పొయ్యి లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ పుష్పలత చేతుల మీదుగా సుమారు 200 పొగరాని పొయ్యిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న వృక్షాలను వంట చెరుకు నిమిత్తం నరకడమే గాక వాటి వలన గృహిణుల ఆరోగ్యం, అదేవిధంగా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి ఈ పొగరాని పొయ్యిలు ఉపయోగకరమన్నారు, ఈ పొయ్యిల వలన గృహిణిలు పొగ నుంచి రక్షణ పొందే అవకాశం ఉందన్నారు. పొగ ద్వారా వ్యాపించే వ్యాధులకు దూరంగా ఉండేందుకు సులభతరంగా ఉంటుందన్నారు. ఈ పొయ్యిలు తక్కువ కట్టెలతో వంట చేసే విధంగా కంపెనీ తయారు చేసిందని ఆ కంపెనీ మండల కోఆర్డినేటర్ బూదరాళ్ళ సోమరాజు అన్నారు. ప్రస్తుత కాలంలో గ్యాస్ ధరలు పెరిగిపోతున్న తరుణంలో గ్యాస్ వినియోగదారులైన పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ పొయ్యిలు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. అటువంటి పేద ప్రజల కోసం క్రాఫ్ జోన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పొగరాని పొయ్యిలను ఉచితంగా సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వర రావు, క్రాఫ్ట్ జోన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ కే యమునా, కే సత్యవతి, కే బాలకృష్ణ, క్రాఫ్ట్ జోన్ సహాయకులు వేములపూడి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించని అంగన్వాడీ కార్యకర్తలకు స్థాన చలనం

విశాలాంధ్ర - పాయకరావుపేట : విధులు సక్రమంగా నిర్వహించని ముగ్గురు అంగనవాడి కార్యకర్తలను స్థానచలనం చేస్తూ నక్కపల్లి సిడిపిఓ శ్రీవిద్య ఉత్తర్వులు జారీ చేశారు. పాల్మాన్ పేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మైలపల్లి అశోక చక్రవర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాల్మాన్ పేట, రాజయ్యపేట, కొర్లయ్యపేట గ్రామాలలోని అంగనవాడి కార్యకర్తల పై విచారణ నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ సౌజన్య నిర్వహించిన విచారణలో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని తేలింది. ఫుడ్ కన్సోలిడేషన్ రిజిస్టర్ ట్యాంపరింగ్, కొలత ప్రకారం సరిపడా సరుకులు ఇవ్వకపోవడం, లబ్ధిదారులకు సరైన సమాధానం చెప్పకపోవడం కారణాలుగా చూపుతూ దములూరి వెంకటలక్ష్మి, యు. మంగ, ఎం. వెంకటలక్ష్మి అనే ముగ్గురు అంగన్వాడీ కార్యకర్తలకు మెమోలిస్తూ డిప్యూటేషన్ పై వేరే అంగన్వాడి కేంద్రానికి మార్చారు. ఆరు నెలల అనంతరం అక్కడ కూడా విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాల్మాన్ పేట లో విధులు నిర్వహిస్తున్న దములూరి వెంకటలక్ష్మి ని రాజయ్యపేటకు, రాజయ్యపేటలో విధులు నిర్వహిస్తున్న యు. మంగ ను కొర్లయ్యపేట కు, కొర్లయ్యపేట లో విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకటలక్ష్మి ని పాల్మాన్‌పేట కు స్థానచలనం చేస్తూ మరో ఆరు నెలల పాటు పనిష్మెంట్ పైన డిప్యూటీషన్ చేస్తూ సిడిపిఓ శ్రీవిద్య జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు. 6 నెలల అనంతరం వీరిలో మార్పు రాకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఉత్తర్వు లో పేర్కొన్నారు.

ఘనంగా గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చింతపల్లి : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్, పాడేరు మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలోని కుమ్మరి పుట్టు వద్ద ఆమె స్వగృహంలో మంగళవారం నిర్వహించిన జన్మదిన వేడుకలకు చింతపల్లి మండలం నుండి తెదేపా శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభిమానం మరువలేనిదన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలలో తెదేపా విజయం తధ్యమని ఇప్పటినుంచే పార్టీ శ్రేణులు అధికార వైకాపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్, రీమల ఆనంద్, షేక్ ఖాసిం వల్లి, గొల్లోరి మంగు, లక్కోజు నాగభూషణం, సాయం సత్యనారాయణ, వంతల భీమన్న, కేసుబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ గిరిజన ఎస్టీ విభాగం చైర్పర్సన్ పి. శాంత కుమారి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గసభ పంచాయితీ లోగిలి గ్రామం లోని సందర్శించి గిరిజన ఉపాధి కూలీలతో మాట్లాదారు. వలస నివారణలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది అన్నారు. అయితే ఉపాధి కూలీల పని ప్రదేశాలలో మెడికల్ కిట్లు మంచినీరు టెంట్లు వంటి సౌకర్యాలను కల్పిస్తుంటే అన్నారు. అయితే ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ఉపాధి కూలీల పని ప్రదేశాలలో ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా గిరిజనులకు ఉపాధిని చూపే పథకాన్ని నీరుగారిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పని ప్రదేశాలలో టెంట్లు తాగునీరు మెడికల్ కిట్టు తదితర సౌకర్యాలను కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. లేనివక్షంలో ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగూడ, అరకు లోయ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు భద్రం రఘురాం చందర్రావు రామచందర్ సింహాద్రి గోవర్ధన్ వెంకట్ గోవింద్ గురుబరి తిలోతమ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లికి బదులు...మాకవరపాలెం జిల్లా

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అందించే జనన ధృవపత్రాలపై అనకాపల్లి జిల్లాకు బదులుగా మాకవరపాలెం జిల్లా అని వస్తోంది. దీంతో ధృవపత్రాలు పొందే వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధృవపత్రాలతో ఏదైనా దరఖాస్తులు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించి సక్రమంగా ధృవపత్రాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.